పరిక్షిసరి

"చెప్పవమ్మా శారదా! - నీ బంగారు పలుకుకోసం నీ మొగుడెలా నిలబడిపోయాడో చూడు!" అంది పొరుగింటి పార్వతమ్మ.

"చెప్పవే!-నిన్న మొన్నటిదాకా నీతో ఆడుకుంటూ వుండే ప్రకాశమేకదూ?--ఎందుకలా సిగ్గుపడతావ్?" అంది అక్క జానకి.

"చెప్పుతల్లీ! - చూడు! - అంతా ఎలా నిల్చుండిపోయారో? - మన ప్రకాశం పేరు చెప్పడానికి అంత సిగ్గెందుకు?" అంది తల్లి కాంతమ్మ బుజ్జగింపుగా కూతురి తల నిమురుతూ.

..మంగళసూత్రధారణ అయిపోయిన అనంతరం వధూవరులను విడిదిలోనికి తీసుకు వచ్చారు. విడిదిలోనికి వెళ్లేముందు తలుపుల దగ్గర వధువు పేరు వరుడు, వరునిపేరు వధువు చెప్పాలి!

వధువుపేరు అడగడమే తడవుగా వరుడు, 'శారదా రాణీ' అని చెప్పేశాడు. ఇంక వధువువంతు వచ్చింది...అక్కడే వచ్చింది చిక్కు!-ఆమె నోటినుంచీ ఆమాట రావడంలేదు. దానితో పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె సహితంగా వచ్చిన పెళ్లివారంతా ద్వారం ముందు ఆగిపోయారు. వరుని పేరు వధువు చెబితేనే కాని వారిని లోనికితీసుకు వెళ్ళడానికీ వీలులేదు. ఇంకా విడిదిలో చేయవలసిన వేడుకలు చాలా వున్నయ్. పావుగంట గడిచింది. పెళ్ళికుమార్తె పెళ్ళికుమారుని పేరు చెప్పలేదు.

"చెపవమ్మా కోమలా! - ఇప్పుడే ఇంత గయ్యాళివై నిల్చోపెట్టావ్ నా వాడిని! - ముందుముందు మరెంత గయ్యాళి వవుతావో?" అంది అత్తగారు రాజేశ్వరమ్మ నవ్వుతూ.

అమ్మో! - ఈపిల్ల సామాన్యమైనది కాద ప్రోయ్!-మొగుణ్ణి నిల్చోపెట్టే శక్తివంతురాలు!" అంది పెద్దాడపడుచు విశాలాక్షమ్మ

"పిల్ల ఇంత గయ్యాళిదని తెలిసే చేసుకొనేవారంకా మమ్మా! - ఈవిడతో మా తమ్ముడు వేగలేడు!" అంది చిన్నాడబడుచు కామేశ్వరమ్మ హాస్యంగా.

అందరి మాటలు వింటూ సిగ్గుతో ఎర్రబారినముఖాన్ని వంచుకుని అలాగే నిల్చుండిపోయింది పెళ్ళికూతురు శారద. ఆమెతో పాటే నిల్చుండిపోయాడు పెళ్ళికొడుకు ప్రకాశం. వారిద్దరితో కూడా వచ్చిన ముత్తయిదువులంతా ద్వారంవద్ద ఆగిపోయారు.

"చెప్పమ్మా!-ఎందుకంత సిగ్గు?" అంది తల్లి.

"మనముంటేనే ఆ సిగ్గు!...ఓ!-ఇలాంటి వాళ్లని చాలామందిని చూశాం!" అంది పొరుగింటి పార్వతమ్మ.

పంతుల కృష్ణారావు

"దానికిమాత్రం మాటాడాలని లేదా యేమిటి?-కొంచెం ఆపెళ్ళికూతురు సిగ్గు చూపించకపోతే బాగుండదు కదా అని చూపిస్తోంది కాని!" ఎదురింటి సీతమ్మ.

"చాలమ్మా నీ సిగ్గు! - అరగంటసేపు చూపించావుగా? ఇంక చెప్పు!" అంది ఒదిన నాగరత్నం

శారద తలవంచుకునే ముసిముసిగా నవ్వింది

"అబ్బో!-నవ్వుతోందే!"అంది చిన్నాడబడుచు కామేశ్వరమ్మ.

"మరేమిటనుకున్నారు 'నే నేకదా మొగుణ్ణింతసేపు నిల్చోపెట్టేను' అని నవ్వుకొంది గొప్పగా.", పెద్దాడబడుచు విశాలాక్షమ్మ అంది.

"ఒక్క మొగుణ్ణేకాదు; మిమ్మల్నందరినీ కూడా 'ఖబేరావ్' అని నిల్చోపెట్టగలదు మాశారద!" అంది ఒదినగారు నాగరత్నం.

"అమ్మ బాబోయ్! - ఇలాటిదైతే మా కెక్కడ్లేదు!" అంది చిన్నాడబడుచు హాస్యంగా.

ఇంతలోకి పెళ్ళిపెద్ద మాధవరావుగారు వచ్చి "ఇంకా అక్కడే నిల్చున్నారా?" అని అడిగారు.

"మీకోసమే ఏపనీ కాకుండా నిల్చోపెట్టేస్తున్నది" అంది రాజేశ్వరమ్మ.

"ఇదిగో, భోజనాలు కూడా ఇంకా కావాలి!-చాలా పనులున్నయ్ వేగం చెప్పమ్మా!" అంది కాంతమ్మ.

"చెప్పవే!-చెప్తావా? మీ మామగారిని పిలవమంటావా?" అంది రాజేశ్వరమ్మ.

"మా శారదకి మామగారంటే భయమా ఏమిటి?" అంది నాగరత్నం.

"చెప్పు తల్లి!-ఇంతసేపు ఇక్కడ నిల్చుంటే మరి భోజనాలెప్పుడవుతాయి?-ఊరేగింపు ఎప్పుడవుతుంది?" అంది తల్లి.

కాని పెళ్ళికూతురు మాత్రం మాటాడలేదు.

"అబ్బ!-బతిమాలుతున్నకొద్దీ మురిపిస్తోందమ్మా పిల్ల!"అంది చిన్నాడబడుచు కోపంగా.

"అదిగో, చూశావా మీ ఆడబడుచుకి కోపం వచ్చేసింది. ఇప్పుడే చెప్పు!" అంది అక్కగారు.

"కోపగించుకోనక్కర్లేదమ్మా! మాశారద చెప్పేస్తుంది!" అంది పార్వతమ్మ.

"ఏం శారదా చెప్పమ్మా!" అంది సీతమ్మ.

శారద సిగ్గుతో తలవంచేసుకొని ముసిముసి నవ్వులు నవ్వుతూ 'ప్రకాశరావు' అంది సన్నని స్వరంతో.

"హమ్మయ్య!-ఈమాట అనిపించేసరికి ముక్కోటిదేవతలు దిగివచ్చినంతయింది." అంది పెద్దాడబడుచు నవ్వుతూ.

"మరేమిటనుకున్నారు? మా శారద పలుకు

బంగారం లాంటిది. చవగ్గా దొరకదు!" అంది నాగరత్నం.

"మొత్తంమీద మహా ఘటికురాలు! అందరినీ అరగంటసేపు నిల్చోపెట్టింది." అంది చిన్నాడబడుచు.

అంతా పకపకనవ్వారు. వధూవరులని విడిదిలోనికి తీసుకువెళ్లారు.

* * *

గది విద్యుద్దీపాలతో ప్రకాశిస్తోంది. గదిలో ఒకప్రక్క పెద్ద పందిరిమంచం అందంగా అలంకరించబడివుంది. వేరొకప్రక్క ఒక వెండిపళ్లెంతో మిఠాయి, పన్నీరుబుడ్డీ, సెంటుసీసా, మల్లె, సంపెంగ పువ్వులదండలు టేబిల్ మీద వున్నయ్. గది గోడలకి రెండువైపులా రెండు నిలువుటద్దాలు ఫోటోలు మనోహరంగా అలంకరించబడి వున్నయ్. గదంతా సెంటు, మల్లె సంపెంగ పువ్వులు, అగరువత్తుల పరిమళాలతో నిండి పోయివుంది.

ప్రకాశం మంచం మీద చేరబడి కిటికీలోంచి ఆకాశంలో వెన్నెలలు చిందుతూ పరుగెత్తుతూన్న చందమామవంక చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. ప్రక్కనే శారద తలుపువద్ద నిల్చునివుంది. కాని ప్రకాశం ఆమెవంక చూడలేదు. అలాగే ఆకాశంవంక చూస్తూ కూర్చున్నాడు.

అరగంట గడిచింది. శారద అలా తలుపు వద్ద నిల్చునేవుంది. ప్రకాశం అలాగమంచం మీద కూర్చునే వున్నాడు. శారద భర్త వంక చూసింది. అతను ఏమీ తనకి సంబంధం లేనట్టు ఇంకా అలాగే కూర్చొనివున్నాడు.

శారద ఇంక వూరుకుంటే లాభం లేదను కుంది. భర్త దృష్టిని తనవేపు త్రిప్పడానికి తను వున్నట్టుగా అతనికి గుర్తు చేయడానికీ అని కొంచెం దగ్గింది. ప్రకాశం దృష్టిని ఒక నిముషం ఆమెమీద ప్రసారించి మళ్లీ ఆకాశంమీదకు మళ్ళించి యథాప్రకారంగా కూర్చొనివున్నాడు.

శారద ఖిన్నురాలైంది. ముఖం వివర్ణమైంది. ఎంతో బాధపడింది. లోలోపల నుంచి దుఃఖం పొంగుకు రాసాగింది. ఆ రాత్రిని ఎంతో మధురంగా ఊహించుకుంది. ఏమిటేమిటో కలలుకంది. కాని భర్త ఇలా ప్రవర్తించడంతో ఆ కలలన్నీ కల్లగా మారుతాయేమో ననిపించిం దామెకు.

మరో పదినిముషాలు అతలుపువద్ద నిల్చొని చూసింది శారద. కాని ప్రకాశం కదలకుండా కూర్చున్నాడు. భర్తవచ్చి తీసుకు వెళతాడన్న ఆశ శారదకిపోయింది. ఇంక మరోదారి తోచక తనే భర్త కూర్చున్నదగ్గరకు వెళ్లి నిల్చుంది.

అప్పటికీ ప్రకాశం ఆమెవంక చూడలేదు... శారద ఆలోచించింది... పాలగ్లాసు తెచ్చి నోటి కందించింది.... అత వదోకలాగ చూచి ప్రక్కకు త్రోసేశాడు.

శారద చాలా ఆందోళన పడింది. 'ఏమండీ!' అని పిలిచింది. భర్త పలుకలేదు. శారద నిట్టూర్పు విడిచింది తలవంచుకొని నేలవంక చూస్తూ నిల్చుంది. ఆమెకేమీ తోచడంలేదు.

"ఇటు చూడరూ?" అంది శారద మళ్లీ. అతనుదృష్టి మళ్లించలేదు. శారద చాలా బాధపడింది. ఆమెకు భర్త ప్రవర్తనేమీ అర్థంకాలేదు. దుఃఖం పొర్లుకు రాసాగిందతని ప్రవర్తనకి. నేత్రాంచలాల్నుంచి అశ్రువులు ప్రవహింపసాగినయ్. "నే నేం నేరం చేశానో చెప్పండి!" అంది రుద్ధకంఠంతో.

"ఏమీ లేదు!" ఆమెవంక చూడకుండానే ఆకాశంవంక చూస్తూ సమాధాన మిచ్చాడు ప్రకాశం.

"మరయితే నన్నెందు కిట్లా బాధిస్తున్నారు?"

ప్రకాశం మాటాడలేదు.

"ఇట్లా ప్రవర్తించి నన్ను హింసించడంలో మీ ఉద్దేశ్య మేమిటో చెప్పండి!"

"ఏ ఉద్దేశ్యమూ లేదు!"

"అయితే అనవసరంగా నన్నెందు కిట్లా బాధిస్తున్నారు?"

"............"

"నేను బాధపడడమే మీ కానందమా?"

"............"

"నన్ను పెళ్లాడి ఇట్లా కష్టపెట్టడం న్యాయమేనా మీకు?"

భర్త పలుకలేదు.

శారద ఇంకా ఆవేశంతో ఏదో అంటోంది. ప్రకాశం ఇంకా చూస్తూ ఊరుకుండలేకపోయాడు. ఒకసారి నవ్వి, లేచి, తలుపుదగ్గర నిల్చొని ముఖం చేతులతో కప్పుకొని వెక్కి వెక్కి ఏడుస్తూన్న శారద వద్దకు వెళ్ళి, చేతులని ముఖంమీదనుంచి తీసి, ముఖాన్ని తనవైపు త్రిప్పుకొని 'పిచ్చిపిల్ల!' అని అన్నాడు మందహాసం చేస్తూ.

శారద అర్థంకాక భర్త కళ్లలోకి చూసింది.

"హుఁ!-ఇంతేనా నీ ధైర్యం?-ఉదయం తలుపులదగ్గర నా పేరు చెప్పకుండా అరగంటసేపు నిల్చోపెట్టావే నన్ను? ఇప్పుడు నే నూరుకుంటా నేమిటి?" అన్నాడు ప్రకాశం చిలిపిగా నవ్వుతూ.

శారద కిప్పుడంతా అర్థమైంది. ఆమె ముఖం ఆనందంతో వికసించింది.

"నిజంగానా?" అని అడిగింది నమ్మలేనట్టుగా.

"లేకపోతే పెళ్లాడి హింసించడానికి నేనంత హృదయంలేనివాడి ననుకొన్నావా శారదా?" అన్నాడు ప్రకాశం.

"మీ రంత అన్యాయం చేస్తారని అనుకోలేదు. కాని కారణం ఏమిటో తెలియక మనస్సంతా అదోలా అయిపోయింది!... అబ్బ!—బలేవారండీ మీరు!-ఏమిటో అనుకొని భయపడి చచ్చాను" అని ఆనందపారవశ్యంతో అంది శారద.

"పోనీ ఇప్పుడు నా పేరు చెప్తావా?" అని అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

"ఇప్పుడు చెప్పడానికేం? - నలుగురిలో అయితే సిగ్గేస్తుందండీ!-అంతా వేళాకోళా లాడుతారు. కావలిస్తే ఇదిగో ఇప్పుడు మీ పేరు చెబుతున్నాను! - ఊఁ! - సరేనా?— మీ పేరూ - ప్రకాశరావు!" అంటూ కిలకిలా నవ్వింది శారద. ★

జలుబు, చలి, దగ్గు, గొంతు నొప్పి, ఇన్ఫ్లుయంజ లేక రొమ్ము పడిసెముల చిహ్నం కనిపించగానే పెప్సను సేవించుడు. పెప్సలోని శమనకర అంటు విరోధక ఔషధ సారములు, గుండెలు, ఊపిరి తిత్తులలోకి లోతుగా చొచ్చి—త్వరగా ప్రమాదకర క్రిములను నశింపజేయును—మంటతో గూడిన వాపును రహిత మొనర్చును—రేగిన నొప్పిని శమనపర్చి వేయును డాక్టర్లు పెప్సను శిఫారసు చేసి యున్నారు. చిన్నలు, పెద్దలు కూడ సేవించవచ్చును, ఇందు ప్రమాదకర ఓషధులు లేవు.

PEPS

పెప్స గొంతు మరియు గుండెల అంటు విరోధక బిళ్లలు

FPY-41-TEL

సోల్ ఏజెంట్లు : దాదా & కంపెనీ, 86, సైనప్పనాయక్ వీధి, మద్రాసు-8.